
www.prajasakti.com
ప్రజాశక్తి



పిఎస్ఎల్వి సి-60 ప్రయోగానికి సిద్ధం...



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అంతరిక్షంలో మరో అద్భుత విన్యాసానికి రంగం సిద్ధం చేసింది. భవిష్యత్ భారతీయ అంతరిక్ష స్టేషన్ నిర్మాణం కోసం పరిశోధాత్మక ప్రయోగాలను మొదలు పెడుతోంది.. ఇందులో భాగంగా శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుండి సోమవారం రాత్రి 9.58 గంటలకు పిఎస్ఎల్వి సి-60 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఈ రాకెట్ ద్వారా 440 కిలోల బరువు కలిగిన స్పేడెక్స్ మిషన్‌ను రెండు వేరు వేరు భాగాలుగా ప్రయోగించనున్నారు. దీని వల్ల ఇస్రోకు ఎన్నో ప్రయోజనాలు లభించనున్నాయి.. కౌంట్ డౌన్ మొదలైన ఈ పిఎస్ఎల్వి -60 ప్రయోగం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు... (వార్త మెయిన్‌లో)

ముగిసిన బాలోత్సవం

ప్రతిభావంతులకు ప్రోత్సాహాలు అందజేత

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పిల్లల పండగ ఆదివారం అట్టహాసంగా ముగిసింది. తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం ప్రారంభమైన పిల్లల పండగ, ఆదివారం కూడా కొనసాగింది. చివరి రోజు శాస్త్రీయ నృత్యాలు, కోలాటాలు, జానపద నృత్యాలు, దేశభక్తి గీతాల ఆలాపనలు తదితర పోటీలు నిర్వహించారు. అన్ని అంశాలలో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ మూడు విభాగాలుగా పోటీలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం జరిగిన మట్టి బొమ్మల తయారీ పోటీలలో విద్యార్థులు మరింత ఉత్సాహంగా పాల్గొని, పలు రకాల బొమ్మలను ఉత్సాహంగా తయారు చేశారు. రెండు





రోజులపాటు ఆరు వేదికల ద్వారా 30 అంశాలతో 70 విభాగాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన ప్రతిభావంతులకు, ముఖ్యఅతిథులు చేతులమీదుగా ప్రశంసాపత్రాలు, షీల్డులు అందజేశారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా సమావేశానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన రోటరీ క్లబ్ సభ్యులు కెవి.చలపతి మాట్లాడుతూ విద్యార్థులు బలమైన కోరికలను ఎంచుకోవాలి, ఆ దిశగా ప్రణాళిక బద్ధకంగా ముందుకు వెళ్లాలన్నారు. నిరంతరం కృషి చేస్తే ఎలాంటి సమస్యనైనా అధికమించవచ్చునని తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ బాలోత్సవం కార్యక్రమం మంచి ఉత్సాహం అందించిందన్నారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ప్రతి నిమిషాన్ని తమకు అనుకూలమైన విధంగా మలుచుకొని, లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు. మానవ హక్కుల నాయకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ బాలోత్సవాన్ని చూస్తుంటే తన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొస్తున్నాయని, ప్రతి విద్యార్థి స్కిల్‌ను పెంపొందించుకొని, కొత్త ఆలోచనలతో ముందుకెళితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు అన్నారు. ఓటమికి కుంగిపోకుండా గుణపాఠంగా మలుచుకుని విజయం వైపు



పైనుంచి కోరారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు మల్లారపు నాగర్జున, గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం, అధ్యక్షులు నడ్డి నారాయణ, కార్యదర్శి పయ్యావుల గురునాథం, సభ్యులు నెల్లూరు ముని లక్ష్మి, మోహన్ మూర్తి, ఇతర నాయకులు కమిటీ మెంబర్లు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇలాంటి పోటీలు మాలాంటి వారికి అవసరం
- ధనుషా, 10వ తరగతి, తిరుపతి.



నా చిన్నతనం నుంచి నాకు ఆటలు పాటలు చాలా ఇష్టం. ఈ చిన్ని మ్యూజిక్ వినిపించిన గెంతులు వేసేదాన్ని. ఒకపక్క చదువుకుంటేనే మరోపక్క డ్యాన్స్ పై దృష్టి పెట్టాను. తల్లిదండ్రులు, అన్నా అక్కవాళ్ళు ప్రోత్సహించారు. అప్పుడప్పుడు పలు ప్రదర్శనలో నా డ్యాన్సును ప్రదర్శించేదాన్ని. ఈ బాలోత్సవం వేదిక ద్వారా మరోసారి నా డ్యాన్సర్ ప్రదర్శించే అవకాశం వచ్చింది. ఇందుకు నిర్వాహకులకు కృతజ్ఞతలు.

బొమ్మల గీయడం ఆశ
- సూర్య, ఏడవ తరగతి విద్యార్థి, తిరుపతి.



చిన్నప్పటినుంచి బొమ్మలంటే చాలా ఆశ. అందుకే బొమ్మలు గీయడం నేర్చుకోవాలని అనుకున్నాను. అప్పుడప్పుడు చిన్న చిన్న బొమ్మలు గీసే వాడిని. టీచర్ల ప్రోత్సాహంతో పలు సీనరీలు గీయటం ప్రారంభించాను. నా సామర్థ్యాన్ని పరీక్షించుకుందాం అని ఈ పోటీలలో పాల్గొంటున్నాను. ఇలాంటి పోటీలు ఎంతో అవసరం.

దేశ సేవ చేయాలనుంది
- ధరణి, 9వ తరగతి, తిరుపతి.



నాకు చిన్నప్పటి నుంచి దేశ సేవ చేయాలని ఆశ. నాతోటి పిల్లలు చాలామంది డ్యాన్సులు, క్రీడలు, ఆట పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తి చూపేవారు. కానీ నాకు దేశ రక్షణ విభాగంలో పనిచేయాలని ఉంది. అందులో భాగంగానే మా తల్లిదండ్రులను ఒప్పించి ఎన్సిసిలో చేరాను. ఇలాంటి కార్యక్రమంలో భద్రతకు సంబంధించిన పనులు చేస్తుండడం సంతోషంగా ఉంది.



బాలోత్సవాన్ని సందర్శించిన పి. మధు

మాజీ రాజ్యసభ సభ్యులు, సిపిఎం సీనియర్ నాయకులు పి. మధు బాలోత్సవాలను సందర్శించారు. టీటీడీ పరిపాలన భవనం వద్ద టీటీడీ శ్రీవారి మెట్టు వ్యాపారులు చేస్తున్న దీక్షలకు మద్దతు తెలిపిన ఆయన, అక్కడి నుంచి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానానికి చేరుకొని బాలోత్సవం కార్యక్రమంలో విద్యార్థులు చేస్తున్న ప్రదర్శనను తిలకించారు. వేలాదిమంది విద్యార్థులకు తమ ప్రతిభ పాటవాలు చాటేందుకు, అంత పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాలోత్సవ కమిటీని ఆయన అభినందించారు. ఆయన వెంట సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం మాజీ రాజ్యసభ సభ్యులు పి మధు

మతోన్మాద పాలకులు దేశానికి ప్రమాదకరం
సీపీఎం మాజీ రాజ్యసభ సభ్యులు పి మధు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి మతపరమైన పాలన తీసుకొస్తోందని, మతోన్మాద పాలకులు దేశానికి ప్రమాదకరమని సీపీఎం మాజీ రాజ్యసభ సభ్యులు పి మధు పేర్కొన్నారు. తిరుపతి యశోదనగర్ సీపీఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మధు మాట్లాడుతూ పార్లమెంటులో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో జమిలి ఎన్నికలను ముందుకు తీసుకొస్తోందని విమర్శించారు. దేశ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలపై కూటమి పార్టీ నేతలు స్పందించకపోవడం అన్యాయమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మతోన్మాద శక్తుల ఆట కట్టించాలి..

తిరుపతి టౌన్, తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో గత కొన్నాళ్లుగా సాగుతున్న మతోన్మాద శక్తుల ఆగడాలను అరికట్టాలని సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు, అగ్రనేత పెనుమల్లి మధు అన్నారు. రాష్ట్రంలో దళితులు, ఆదివాసీలపై మతోన్మాద శక్తుల దాడులను ఖండిస్తూ రాష్ట్రస్థాయి సదస్సు తిరుపతి అంబేద్కర్ భవన్‌లో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ పూతలపట్టు అంజయ్య అధ్యక్షత ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథి పెనుమల్లి మధు మాట్లా డుతూ దేశంలో, రాష్ట్రంలో బిజెపి ఆగడాలు మితిమీరిపోతున్నాయని బిజెపి అనుయాయ శక్తులుగా ఉన్న వీహెచ్‌పి, ఆర్ఎస్ఎస్ లాంటి మతోన్మాద శక్తులు తిరుపతిని కేంద్రంగా చేసుకొని దేశంలో ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి కారణ మవుతు న్నాయని గుర్తు చేశారు. మతోన్మాద శక్తుల ఆగడాలు పెరగడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యవహరిస్తున్న తీరు కూడా ఓ కారణమన్నారు. బిజెపి రాష్ట్రంలో జనసేన, టిడిపిలకు ఉరితాడుగా పరిణమిస్తోందన్నారు. మతోన్మాద శక్తులను నియంత్రించకపోతే ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న ఆంధ్ర రాష్ట్రానికి అరిష్టమని మధు అన్నారు. టిటిడిలో నిత్యం ఏదో ఒక అంశం ఆధారంగా ఘర్షణలు సృష్టించడానికి బిజెపి అనుయాయిలు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ పరిపాలనలో టీటీడీలో జరిగిన తప్పుడు పనులపై బిజెపి మాట్లాడుతోందని సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి బోర్డులలో బిజెపి ఎమ్మెల్యేలు, కార్యకర్తలు ఎనిమిది మందికి పైగా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ చేసిన పాపాలలో బిజెపి పాత్ర వుందని, 'దొంగే... దొంగ దొంగ అన్నట్టుగా బిజెపి నేతలు టీటీడీలోని ప్రతి నిర్ణయంలో తమ భాగస్వామ్యం వున్నా నేడు అడ్డగోలుగా మాట్లాడుతోందని తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. మతోన్మాదుల ఆటలను ప్రజాస్వామ్య వాదులు, శాంతి కాముకులు ముందుకొచ్చి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య మాట్లాడుతూ తిరుపతిలో పరిణామాలు దేశంలోని పలుచోట్ల ఆందోళనలకు కారణం అవుతున్నాయని వీటిని నివారించాలన్నారు. ఈ సదస్సులో పౌర హక్కుల సంఘం రాష్ట్ర నేత క్రాంతి చైతన్య, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వి. నాగరాజు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, కాళయ్య, గోపి, మాంగాటి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో తిరుపతి నగర ప్రజలు, వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు ఆక్రమణ

దుకాణ దారుల రోడ్డు ఆక్రమణ
నిత్యం ప్రమాదాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్ ప్రధాన కూడలి నిత్య ప్రమాదాలకు నిలయంగా మారింది. కూడలి ప్రాంతంలో వ్యాపారాలు చేసుకుంటున్న కొందరు దుకాణదారులు అక్రమంగా రోడ్డులోకి ముందు కొచేస్తున్నారు. దీంతో దుకాణాల ముందు వాహనాలు నిలబడిపోతుండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. శ్రీకాళహస్తి–పిచ్చాటూరు మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ముందేముందో గుర్తించేలోపే ప్రమాదాలకు గురైన సంఘటనలు చాలానే చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాజీవ్ నగర్ కూడలి వద్ద రోడ్డు అక్రమణలకు అడ్డుకట్ట వేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ప్రచార యాత్ర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార యాత్ర ఆదివారం పుత్తూరుకు చేరుకుంది. వివిఎస్ఎన్ కళ్యాణ మండపం వద్ద చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన నాయకులు ప్రచార రథానికి ఘన స్వాగతం పలికారు. ఎల్ఐసి, ఆర్టీసీ బస్టాండ్, ఆరేటమ్మ గుడి , అంబేద్కర్ సర్కిల్, మెయిన్ స్కూల్ వరకు నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్‌కి పూలమాలవేసి నివాళులర్పించిన తర్వాత యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రమణ,



పుత్తూరుకు చేరుకున్న యుటిఎఫ్ ప్రచార యాత్ర

చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండణ్, తిరుపతి జిల్లా సహాధ్యక్షురాలు స్వర్ణ సంబరాల గురించి కార్యకర్తలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పుత్తూరు, పిచ్చాటూరు, నారాయణవనం, నాగలాపురం, వడమాలపేట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీ లేని ఆహార పదార్థాల విక్రయాలే లక్ష్యం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఆహార పదార్థాలు కల్తీ లేని, శుచికరమైన ఆహారం అందించాల్సిన బాధ్యత తినుబండారాల విక్రయదారులు, వీధి విక్రయ వ్యాపారులు వుందని, భారత ప్రభుత్వం వీధి విక్రయ వ్యాపారులకు అండగా కార్యక్రమాలు చేస్తోందని భారత ప్రభుత్వ ఆయుష్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జయదేవ్ పేర్కొన్నారు. తిరుపతి కలెక్టరేట్‌లో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ఆహార భద్రత ప్రమాణాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆహార భద్రత, ప్రమాణాలపై తినుబండారాల చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఒక రోజు శిక్షణ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ తిరుపతి పుణ్య క్షేత్రంలో వీధి వ్యాపారుల శిక్షణలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భారత దేశంలో అమృత్ కాల్ సమయం ప్రధాని నాయకత్వంలో కొనసాగుతోందన్నారు. ప్రాజెక్ట్ క్లీన్ స్ట్రీట్ ఫుడ్ ఇన్సియేటివ్‌లో భాగంగా ప్రజలకు శుచికరమైన, నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యంగా వీధి వ్యాపారులకు, చిరు వ్యాపారులకు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలు చేపట్టి వారికి శిక్షణ ఇస్తారన్నారు. ప్రజలు తీసుకునే ఆహారం శుచి శుభ్రత కలిగి, నాణ్యతగా ఉండేలా దేశ వ్యాప్తంగా 100 స్ట్రీట్స్ ఫుడ్ హబ్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. అందులో నాలుగు కడప, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించారన్నారు. కేంద్ర ప్రభుత్వం చిరు వ్యాపారులకు, వీధి విక్రయదారుల ఉన్నతికి అండగా అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతగా శుచికరమైన, నాణ్యమైన ఆహారం విక్రయించాలని వ్యాపారులను కోరారు. తినుబండారాల వీధి వ్యాపారులు, స్ట్రీట్ వెండర్స్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకుని, లైసెన్సు పొందాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారికి, గతంలో ఉన్న వంద రూపాయల ఫీజును కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసి ఉచితం చేసిందన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ కింద తిను బండారాలు అమ్మే చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు పిఎం స్వానిధి వినియోగించుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని కోరారు. బ్యాంకులు వాటికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్ రీజినల్ డైరెక్టర్ పంచమ్, జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఐపిఎం ఆంధ్రప్రదేశ్ ఎస్ పూర్ణచంద్రరావు, తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ బాలు నాయక్, తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, తిరుపతి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ట్రైనర్ డాక్టరు ఆంజనేయులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు మద్దిలేటి, జగదీష్, నర్మద పాల్గొన్నారు.

కేంద్ర ఆయుష్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జయదేవ్



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జయదేవ్

జల క్రీడల కేంద్రంగా రాయల చెరువు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రాయలచెరువును జల క్రీడల కేంద్రంగా తీర్చుదిద్దుతామని, యువతను, క్రీడా కారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. రామచంద్రాపురం మండలం రాయల చెరువులో జాతీయ స్థాయి డ్రాగన్ బోటింగ్ పోటీలకు ఎంపికై శిక్షణలో వున్న రాష్ట్ర జట్టు క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిక్షణను ప్రారంభించారు. రాయలచెరువు కట్ట వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకి స్థానిక నాయకులతో కలిసి అధికారులు, అసోసియేషన్ ఛైర్మన్ ప్రదీప్ నాయుడు, నాయకులు, అధికారులు అపూర్వ స్వాగతం పలికారు. క్రీడా కారులను పరిచయం చేసుకుని,క్రీడా దుస్తులను, కిట్లను పంపిణీ చేశారు. అనంతరం డ్రాగన్ బోటింగ్ లో ఉపయోగించే పరికరాల గురించి, నీటిలో ప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన చర్యలను గురించి సి క్యాప్ అసోసియేషన్ ఛైర్మన్ ప్రదీప్ నాయుడు ఎమ్మెల్యేకు వివరించారు. రాయల చెరువుకు మండల అధికారులు, కూటమి పార్టీల నాయకులతో కలిసి ప్రత్యేక, పూజలు చేసి, జల హారతి పట్టారు. రాయల చెరువులో డ్రాగన్ బోట్ లో తిరుగుతూ శిక్షణను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ గత ప్రభుత్వం యువతను క్రీడలను నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకుడు ఐటి విద్యాశాఖ మంత్రి లోకేష్ యువతను అన్ని విధాల అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే క్రీడలకు పెద్దపీట వేస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోనే పెద్ద చెరువు రాయలచెరువును క్రీడా ప్రాంతంగాను, టూరిజం హబ్ గా అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నామన్నారు. రాయల చెరువులో అన్ని పరిస్థితులు కలిసి వస్తే 2025 – 26 సంవత్స రంలో జాతీయ స్థాయి జలక్రీడల పోటీలను నిర్వహించడానికి కృషి చేస్తామన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసము కలగడమే కాకుండా శారీరక దారుఢ్యం ఏర్పడుతుందని తెలిపారు. క్రీడలలో రాణిస్తే ఉన్నత విద్యలో, ఉద్యోగాలు పొందటంలో మంచి అవకాశం కలుగుతుందన్నారు. సి క్యాప్ అసోసియేషన్ ఛైర్మన్ ప్రదీప్ నాయుడు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నాని సహాయ సహకారాలతో, శాప్ ఛైర్మన్ రవి నాయుడు అండదండలతో రాయల చెరువులో డ్రాగన్ బోటింగ్ జాతీయ పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు శిక్షణ ఏర్పాటు చేశామని చెప్పారు. 50 మంది క్రీడా కారులకు ఐదుగురికి కోచ్ లు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాయల చెరువు కట్టపై డ్రాగన్ బోటింగ్ శిక్షణ ప్రారంభోత్సవానికి గుర్తింపుగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ అహ్మద్, తహశీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిరా, వివిధ శాఖల అధికారులు,తిరుపతి పార్లమెంటరీ నాయకులు శ్రీధర్ వర్మ, మండల టిడిపి అధ్యక్షులు తిరుమలరెడ్డి, నాయకులు చేకూరి జనార్దన్ చౌదరి, కొట్టే నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, ఆరి లీల మోహన్, కోరా హరి ప్రసాద్, పసుపులేటి విజయ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, బాదూరు నరసింహా రెడ్డి, త్యాగరాజులు, బాదూరు ధనుంజయులు, పూజారి సుబ్రమణ్యం యాదవ్, మల్లంపల్లి చిరంజీవి, రవికుమార్, బండి విజయ్ కుమార్ రెడ్డి, నాధముని యాదవ్, లెక్కల హేమం త్ కుమార్, సురేంద్ర, కూటమి నాయకులు, డ్రాగన్ బోటింగ్ కోచ్ లు శ్రీను, రాజేష్ ,శేఖర్, యతీష్ ,వాసు, సి క్యాప్ అసోసియేషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.



రాయలచెరువులో బోటింగ్ పోటీలు ప్రారంభిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

దుస్థితిలో బిసి బాలికల హాస్టల్

- వరండాలోనే యథేచ్ఛగా సర్పాల సంచారం
- నడిచి వెళ్లేందుకూ దారి కరువు
- పెచ్చులూడుతున్న భవనం
- కిటికీలకు తలుపులు లేక వణుకుతున్న విద్యార్థినులు
- పట్టించుకోవాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: వంటగది, హాస్టల్ డైనింగ్ హాలులోనే సర్పాలు సంచరిస్తున్నా వరండాలోనే విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్నారు. బిక్కుబిక్కుమంటూ భయం గుప్పెట్లో పెట్టుకుని తినే పరిస్థితి.. హాస్టల్‌కు నడిచి కూడా వెళ్లలేని స్థితిలో వున్న రోడ్డు..హాస్టల్ గదులు పై కప్పు పెచ్చులూడి పడి అధ్వానంగా మారింది. కిటికీలు, తలుపులు కరువయ్యాయి. విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ లేదు..ఇలాంటి దుస్థితిలో వున్న పిచ్చాటూరు ప్రభుత్వ బీసీ బాలికల సంక్షేమ హాస్టల్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిశీలించారు. వెంటనే కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫోను చేసి హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పిచ్చాటూరు ప్రభుత్వ బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ దుస్థితిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆరా తీశారు.ఆదివారం బీసీ సంక్షేమ హాస్టల్ పరిశీలించడానికి స్థానిక హైస్కూల్ వద్ద ఉన్న చెక్ పోస్ట్ వద్దకు ఎమ్మెల్యే చేరుకున్నారు. అక్కడే వేచి ఉన్న స్థానిక నాయకులు హాస్టల్‌కు కారు వెళ్లే అవకాశం లేదని రోడ్డు బాగాలేదని, బైక్‌పై వెళ్దామని సూచించారు. బైక్ కూడా కొంత దూరం వెళ్లి నడపలేని పరిస్థితి లో బురద ఉందని, అక్కడి నుండి ఎమ్మెల్యే బైక్ దిగి బురదలో నడుచుకొంటూ హాస్టల్‌కు చేరుకున్నారు. హాస్టల్ లోని తరగతి గదుల్లో పైకప్పు పెచ్చులూడి అధ్వానంగా, కిటికీలు, తలుపులు లేని గదులను పరిశీలించి వంటగదికి వెళ్లారు. వంటగదిలో పగిలిన కిటికీని ఎమ్మెల్యే పరిశీలిస్తుండగా 'ఈ కిటికీలో పాములు వస్తున్నాయి సార్.. వంట చేయాలంటే భయంగా వుంది సార్..!' అంటూ వంట కార్మికురాలు ఎమ్మెల్యే ఎదుట వాపోయింది. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా కార్పెట్‌లు పంపిణీ చేశారు. 'కప్పుకోవడానికి దుప్పట్లు ఎక్కడ?' అని ఎమ్మెల్యే వార్డెన్‌ను అడుగగా మంజూరు కాలేదని సమాధానం ఇచ్చారు. ప్లేట్లు, గ్లాసులు కూడా గత నాలుగేళ్లుగా ఇవ్వడం లేదని వివరించారు. ఈ కారణంగా ఇద్దరు ఒక ప్లేట్‌లో భోజనం చేసే పరిస్థితిని ఎమ్మెల్యే చూసి నిశ్చేష్టులయ్యారు. వెంటనే పక్కనే ఉన్న స్థానిక టిడిపి నేతల ద్వారా వెంటనే వంటగదికి కిటికీ మరమ్మతు, కొరత ఉన్న ప్లేట్లు ఇప్పించే ఏర్పాట్లు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు.


నిధులు మంజూరు చేయండి..

కలెక్టర్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి

అధ్వాన స్థితిలో వున్న పిచ్చాటూరు బీసీ సంక్షేమ హాస్టల్‌కు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్లును ఫోన్ ద్వారా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. హాస్టల్ దుస్థితితో పాటు హాస్టల్‌కు దారి గురించి కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు. వెంటనే నిధులు మంజూరు చేసి నిరుపేద విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలోనూ ఈ హాస్టల్‌ను పరిశీలించానని, ఇప్పటి వరకు ఎలాంటి మార్పు రాలేదని ఎమ్మెల్యే వాపోయారు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం నియోజక వర్గంలోని 13 ఎస్‌సి సంక్షేమ హాస్టళ్లకు రూ.1.20 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీ సంక్షేమ హాస్టళ్లనూ అంచలంచెలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వ, మంత్రి లోకేష్‌కి ఆసక్తిగా వున్నారన్నారని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని బీసీ సంక్షేమ హాస్టళ్ల దుస్థితిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. స్థానిక ఎంపీడీఓ మహమ్మద్ రఫీకి ఫోన్ చేసి మండల గ్రాంట్ ద్వారా వెంటనే హాస్టల్ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని, సీసీ రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ గీత, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇలంగోవన్ రెడ్డి, అరణీయార్ ఆయకట్టు ఛైర్మన్ రవి రెడ్డి, మాజీ ఎంపీపీ మురళి, టిడిపి నాయకులు బలరాం రెడ్డి, అరుల్ ప్రకాష్, రజని, ఢిల్లీ పాల్గొన్నారు.



బురద రోడ్డులో నడిచి వెళుతున్న ఎమ్మెల్యే



పెచ్చులూడి పడుతున్న పైకప్పు

హామీల అమలుకు పోరాటానికి సిద్ధం కావాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : హామీల అమలుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. గూడూరు సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో ఎ పెంచల ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ విస్తృత సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ హామీల అమలుకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశానికి గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, నుండి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. అన్ని మున్సిపాల్టీలలో జనరల్ బాడీలు చేసి పోరాట ఆవశ్యకతను వివరించాల్సి ఉందన్నారు. జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ కార్మికులందరిని ఐకమత్యంతో సమస్యల పరిష్కారానికి మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం జిల్లా కమిటీ మార్పులు చేసి నూతనంగా కమిటీ ఎన్నుకున్నారు. నవరించి ఎన్నుకున్న నూతన జిల్లా కమిటీ అధ్యక్షులు వి చెంగయ్య, ఉపాధ్యక్షులుగా ఏ రామయ్య, కార్యదర్శి బి గోవింద్, సహాయ కార్యదర్శి బి పెంచల ప్రసాద్, వి పెంచలయ్య, కోశాధికారిగా సిహెచ్ పళనిని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా మరో ఎనిమిది మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు బి వద్యనాథయ్య, గూడూరు పట్టణ మున్సిపల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, పట్టణ కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, బివి రమణయ్య, ఎస్ సురేష్, నాయకులు పాముజి మణి, ఎ ప్రసాద్, కె లక్ష్మయ్య, ఎస్ ముకుంద పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య

స్వర్ణోత్సవాలను విజయవంతం చేయండి: యుటిఎఫ్

ప్రజాశక్తి -నాయుడుపేట: యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు కోరారు. స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార యాత్ర నాయుడుపేటలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యుటిఎఫ్ నాయకులందరూ కాకినాడ పట్టణంలో జరిగే మహా స్వర్ణోత్సవాలకు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు పిలుపు నిచ్చారు. ఆ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, గౌరవాధ్యక్షులు దండు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, స్థానిక నాయకులు హరిబాబు, రామమూర్తి రాజు, గోవర్ధన్ రెడ్డి, సుబ్బారావు, చిరంజీవి, శంకరయ్య, శ్రీనివాసులు, ప్రభుదాసు, శివప్రసాద్, హరి, వాసు పాల్గొన్నారు.


ప్రచార యాత్ర నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

దుస్తులు పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని వీరబ్రహ్మస్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్ సంస్థ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతో తమ సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. దాతల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. దాతలు ససిసెట్టి వెంకట శ్రీధర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ససిసెట్టి వెంకట సుబ్బమ్మ, మలిశెట్టి సాయి, తిరుపతి సాయి, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, కోడిపర్తి శ్రీధర్, మెదురు శ్రీనివాస ఆచారి, పల్లం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని శరదానగర్ ప్రాంతంలో ఉన్న గిరిజన కాలనీలో పీపుల్ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో గిరిజనులకు ఆదివారం దుప్పట్లు, చీరలు, ఇతర దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు పోతుగుంట మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గం రైతు ప్రధాన కార్యదర్శి కొండా రామచంద్రా రెడ్డి, టీడీపీ నాయకులు బెల్లంకొండ రాజా, గెద్ది మధు, కొట్టు సురేష్, బాల రమణయ్య ట్రస్టు కార్యదర్శి విజయమ్మ శంకర్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని నెల్లటూరు చెరువు కట్ట కింద నివసిస్తున్న గిరిజనులకు కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా పడకండ్ల పురుషోత్తమ రావు వ్యవహరించారు. ఈ సందర్భంగా దాత పడకండ్ల పురుషోత్తమ రావు మాట్లాడుతూ, చలి కాలం, గత నెల నుండి వర్షాలు కురుస్తుండడంతో చలికి, వర్షాలకు పేద ప్రజల ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం చేపట్టడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కృప సేవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు,జాయింట్ సెక్రెటరీ అత్తి మంజరి గోపాల్, పర్వతాల రమేష్, పేయ్యల రమణయ్య, పల్లం గురవయ్య, తుమ్మ తోటి శంకరయ్య, కంట్ల కళ్యాణ్ పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్‌గా ఆర్కాట్ కృష్ణప్రసాద్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: వాకర్స్ సెంటర్ నేషనల్ రీజినల్ కౌన్సిలర్‌గా ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ ఎన్నికయ్యారు. ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ కార్యక్రమంలో రాయలసీమ జిల్లా, తమిళనాడు, కర్ణాటక , కేరళ రాష్ట్రాల వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ గా తిరుపతికి చెందిన ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఎన్నికయ్యారు. నియామక పత్రాన్ని సెక్రటరీ జనరల్ ఐజాక్, వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు మురళీమోహన్ రావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వాకర్స్ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని, పేదలకు మరింతగా సేవ చేయడానికి ఉపయోగపడుతుందని రానున్న రోజులలో వాకర్స్ ఇంటర్నేషనల్ ద్వారా మరింత సేవ కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టరు రవిరాజు, ఏరియా వైస్ ప్రసిడెంట్ శరత్ రాజు, మాజీ కౌన్సిలర్ ప్రతాప్, వినాయకం, మాజీ కౌన్సిలర్ మనోహరన్ , శివారెడ్డి , రామస్వామి, రాజు , నరసింహయ్య పాల్గొన్నారు


నియామక పత్రం అందుకుంటున్న ఆర్కాట్ కృష్ణ ప్రసాద్

ఉత్తమ ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకోవాలి

ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రభుత్వ విద్యా రంగంలో విద్యా ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞానం, నైతిక విలువలు పెంపొందించడంలో ఉపాధ్యాయ సంఘాలతో పాటు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన వారి సేవలను వినియోగించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. స్థానిక బైరాగి పట్టడ లోని ఎస్టియు భవన్‌లో ఆదివారం ఎస్‌టియు జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగ పటిష్టతకు వారి సేవలను సూచనలు, సలహాలను వినియోగించుకోవాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఉపాధ్యాయులే దరఖాస్తు చేసుకొనే విధానం కాకుండా ప్రభుత్వమే గుర్తించి అవార్డులు ప్రదానం చేయాలని కోరారు.

స్వేచ్ఛ ఫౌండేషన్‌కు ఉత్తమ సేవా అవార్డు

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని వికృతమాల పంచాయతీలో ఉన్న లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్టు రెండవ వార్షికోత్సవం సందర్భంగా తిరుపతిలో యూత్ హాస్టల్‌లో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. వారి సంస్థకు సపోర్ట్ చేస్తున్న దాతలను స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థల సేవలను గుర్తించి సంస్థ ఫౌండర్ వంశీకి ఉత్తమ సేవా అవార్డును పలువురు ముఖ్య నేతల చేతుల మీదుగా అందించారు.

వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- గూడూరు డిఎస్పీ రమణ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని గూడూరు డిఎస్పీ రమణ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిర్వాహకులు లౌడ్‌స్పీకర్లు మ్యూజిక్ సిస్టమ్ వినియోగించేందుకు విధిగా సంబంధిత పోలీస్ అధికారుల ముందస్తు అనుమతి తీసుకోవాలని చెప్పారు. వేడుకల్లో భాగంగా అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలు లేకుండా చూడాలని సూచించారు. నూతన సంవత్సర వేడుకల్లో ప్రమాదకర విన్యాసాలు, పేలుడు పదార్థాలు వినియోగించ కూడదన్నారు. అతిగా మద్యం సేవించి మితిమీరిన వేగంతో వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నూతన సంవత్సర సందర్భంగా ఎవరైనా మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. గూడూరు వన్ టౌన్ పరిధిలో వాహనాలు తనిఖీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు సిఐ లు శేఖర్ బాబు, కిషోర్ బాబు, శ్రీనివాస్, ఎస్ఐలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గూడూరు డిఎస్‌పి రమణకుమార్

ఉల్లాసంగా... ఉత్సాహంగా..!

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): గత కొద్దిరోజులుగా ముసురు కురిసిన వర్షాలకు శేషాచల అడవుల నుండి వంకలు, వాగులు పరవళ్లు తొక్కుతున్నాయి. నూతన సంవత్సరానికి నాంది పలుకుతూ ఆదివారం సెలవు దినం కావడంతో సమీప ప్రాంత ప్రజలు కళ్యాణి డ్యాం సమీపంలోని రాగిమాను కోన నుండి వస్తున్న నీటిలో పలువురు సరదాగా జలకాలాడుతూ..ఈత కొడుతూ గడిపారు. ఎ రంగంపేట గ్రామానికి చెందిన గ్రామస్తులు అంకాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే భోజనాలు చేసుకుని వనభోజనాలు భుజించారు. అనంతరం పక్కనే ఉన్న రాగిమాను కోన వంక లో ప్రవహిస్తున్న నీటిలో సాయంత్రం వరకు గ్రామస్తులు సరదాగా గడిపారు.


సరదాగా కాలక్షేపం చేస్తున్న ఎ రంగం పేట గ్రామస్తులు


దుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కాలుష్య నివారణ, ప్లాస్టిక్ వినియోగంపై తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాల్టీ పరిధిలో కాలుష్య నివారణ, ప్లాస్టిక్ వినియోగంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునస్వామి ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు నిర్వహిం చారు. కాలుష్య, క్యాన్సర్ కారకమైన 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ ఆదేశాల మేరకు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. తనిఖీలు జరుగుతున్నాయని తెలుసుకున్న హోటళ్లు, వాణిజ్య, ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు, వ్యాపారులు వెంటనే అప్రమత్తమయ్యారు. దీంతో తక్కువ మొత్తంలో కవర్లు సీజ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునస్వామి ఆధ్వర్యంలో తిరుపతి రోడ్డు నుంచి ఆర్డీఎం గేటు మధ్య ఉన్న పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. నాణ్యత ప్రమాణాలను కొరవడిన ఆహార పదార్థాలు వినియోగించకూడదని సూచించారు. ప్రజా ఆరోగ్య భద్రత కాపాడుకోవడంతో పాటు తమకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ నివారణకు పరిశోధనలు పెరగాలి

స్విమ్స్ డైరెక్టర్, ఉపకులపతి ఆచార్య ఆర్‌వి కుమార్

ప్రజాశక్తి - క్యాంపస్ : కేన్సర్ నివారణకూ బయో టెక్నాలజీలో విస్తృతమైన ఆధునిక పరిశోధనలు తీసుకురావాలని పరిశోధకులకు, అధ్యాపకులకు స్విమ్స్ డైరెక్టర్, ఉపకులపతి ఆచార్య ఆర్ వి కుమార్ సూచించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అమెరికా దేశ అలభామా విశ్వవిద్యాలయం, వర్సిటీ బయోటెక్నాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బయో టెక్నాలజీ, మెడిసిన్స్, ప్రివెన్షన్ ఆఫ్ క్యాన్సర్, థెరిఫీ అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్విమ్స్ డైరెక్టర్, ఉపకులపతి ఆచార్య ఆర్ వి కుమార్ మాట్లాడుతూ కేన్సర్ నివారణకు ఆంకాలజీ విభాగం రోజు రోజుకి అభివృద్ధి చెందుతుందని అన్నారు. క్యాన్సర్ వ్యాధి నివారణకు అనేక రకాల అడ్వాన్స్ చికిత్సకు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ కూ అనేక రకాలైన జన్యుపరమైన వైవిధ్యాలను బయోటెక్నాలజీ ద్వారా గుర్తించారని అన్నారు. ఈ బయోటెక్నాలజీ తో వణుకుడు రుగ్మతలకు 'మావిలోని మూల కణాలు' ద్వారా నయం చేయవచ్చున్నారు. సంతాన ఉత్పత్తి, ఔషధాలు, ట్రాన్స్‌ప్లాంటేషన్, జన్యు మార్పిడి వాటిపై బయోటెక్నాలజీలో ఇంకా పరిశోధనలు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఆచార్య కెవి సరిత, మిథున్, ఒప్పంద అధ్యాపకులు, దేశ విదేశాల పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




సమావేశంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అది బాల్యంలో అను బంధం.. అరమరికలు లేని స్నేహం.. ఇరవై ఏళ్ల నిరీక్షణ అనంతరం..ఈ ఉదయం కోసమే అన్నట్లు ఎదురు చూపులు ఫలించిన వేళ... ఒకరినొకరు పలకరింపులు.. ఆప్యాయతతో ఆ లింగనాలు..ఈ భావోద్వేగ క్షణాలకు ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని సెయింట్ జేవియర్ స్కూల్ వేదికైంది. 2004-05లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, వారి గురువులు ఒక్క చోట కలుసుకున్నారు. చిన్ననాటి చిలిపి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందించారు. ఆనాటి గురువులతో ఉన్న అనుబంధాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కల్యాణ్, అశోక్, వసంత్, శివ, రవి, నజీర్, అశ్విని, గాయత్రి, నదియా, కీర్తి, జ్యోత్స్న, శ్రీలక్ష్మి, వర్ధిని, శశికళ, బాలాజీ, అనుదీప్, ప్రమోద్, కిషోర్ పాల్గొన్నారు.

జనసేన నాయకుల సమావేశం

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు మండల జనసేన కార్యకర్తలతో శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ వినుత కోటా రేణిగుంట లోనే తన స్వగృహంలో జనసేన బలోపేతానికి చేయాల్సిన కృషి, గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారం, కార్యకర్తలకు అధికార భాగస్వామ్యంలో అవకాశాలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ఆరు నెలల కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రజల కోసం చేస్తున్న కృషి గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు కిరణ్ కుమార్, మండల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కయాక్‌లో ఆంధ్రప్రదేశ్ కి అరుదైన విజయం

సి క్యాప్ అసోసియేషన్ అధ్యక్షులు బలరామ నాయుడు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: 3వ జాతీయ స్థాయి కయాక్ జలక్రీడలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు అరుదైన విజయం కైవసం చేసుకున్నందుకు ఎంతో గర్వంగా ఉందని సి క్యాప్ అసోసియేషన్ అధ్యక్షులు బలరామనాయుడు అన్నారు. ఆదివారం రాయలచెరువు కట్ట పైన డ్రాగన్ బోటింగ్ రాష్ట్ర జట్టుకు నిర్వహిస్తున్న శిక్షణ సమయంలో ఆయన విలేకరులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు సాధించిన విజయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వారి సహాయ సహకారంతో ఉత్తరాఖండ్ రిషికేశ్ సమీపంలోని శివపురిలో జరిగిన 13 వ కెనాయ్ నేషనల్ ఛాంపియన్షిప్ 2024 లో 3 వ జాతీయస్థాయి కయాక్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు ఎంతో ఉత్తమ ప్రతిభ చూపి అందరి దృష్టిని ఆకర్షించిందన్నారు. నగిడి గాయత్రి దొడ్డి, చేతన భగవతి,కొల్లకాని విష్ణు,నగిడి రాజేష్ జాతీయస్థాయి జట్టుకు అర్హత సాధించారని వివరించారు.వీరిలో నగిడి రాజేష్ పురుషుల కెనాయ్ విభాగంలో కాంస్య పతకం సాధించారని తెలిపారు. నిరంతర శ్రమ , కార్యదీక్ష , అనితరసాధ్యమైన ప్రాక్టీస్ వీరి విజయానికి దోహద పడిందన్నారు.కోచ్ లు నేర్పిన క్రీడా మెలుకువలు వీరిని విజయానికి దగ్గర చేశాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ చైర్మన్ అనిమినేని రవికుమార్ అందించిన సహకారమే వారికి కొండంత అండగా నిలిచిందన్నారు. జాతీయస్థాయికి అర్హత సాధించిన కెనాయ్ క్రీడాకారులను సి క్యాప్ అసోసియేషన్ చైర్మన్ ప్రదీప్ నాయుడు, కోచ్‌లు అభినందించారు.



కయాక్ పోటీలకు ఎంపికైన నలుగురు క్రీడాకారులు

వాకర్స్ అసోసియేషన్‌కు విశిష్ట సేవ అవార్డు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అంతర్జాతీయ వాకర్స్ అసోసియేషన్ 33వ వార్షిక సమావేశం పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ 2024 సంవత్సరంలో చేసిన సేవలకు విశిష్ట సేవ అవార్డును ఆ సంఘ ప్రధాన కార్యదర్శి చల్లా మునికృష్ణయ్యకు అందించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 302 గవర్నర్ రావిళ్ల మాధవ నాయుడుకు బెస్ట్ సర్వీసెస్ అవార్డు ప్రదానం చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రసిడెంట్ ఎలెక్ట్2025 ఎన్నికల పత్రం డాక్టర్ రవి రాజుకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ పీఎస్ కృష్ణంరాజు పాల్గొన్నారు .

ఫరీద్ బాబా దంపతులకు బళ్లారి రాఘవ జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-తిరుపతి: తిరుపతి జిల్లా, రేణిగుంటకు చెందిన ఎంఎ జబ్బార్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ప్రముఖ సామాజిక సేవకులు, కళాపోషకులైన డాక్టర్ షేక్ ఫరీద్ బాబా దంపతులకు విశ్వ నట చక్రవర్తి బళ్ళారి రాఘవ జీవిత సాఫల్య పురస్కార ప్రదానం చేశారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో సుబ్బరాజు నాట్య కళా పరిషత్ 63వ వార్షిక జాతీయస్థాయి మూడు రోజుల పవన్ కళ్యాణ్ నాటకోత్సవాలు ఆదివారం ముగిశాయి. కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు మాట్లాడుతూ గత ఆరు దశాబ్దాలకు డాక్టర్ కోనేటి సుబ్బరాజు దేశ విదేశాల్లో నాటక ప్రదర్శనలు ఇస్తూ కళలే తన జీవితంగా, కళా రంగమే తన కుటుంబంలా భావించి తనకంటూ ఓ గుర్తింపును తెచ్చుకుంటూ సాంస్కృతిక రంగానికి అంకితమైన వ్యక్తిగా, ఓ శక్తిగా ఎదిగారని కొనియాడారు. త్వరలో ఈయన విదేశాల్లో ప్రదర్శించనున్న నాటికకు మంచి గుర్తింపు లభించాలని ఆకాంక్షించారు. అనంతరం ఇదే వేదికపై కళా పోషకులు, సామాజిక సేవకులుగా డాక్టర్ ఫరీద్ బాబా దంపతులు చేస్తూన్న సేవలను గుర్తించి వారికి బళ్లారి రాఘవ జీవిత సాఫల్య విశిష్ట పురస్కారం ప్రదానం చేశారు. కళా కారులను సత్కరిస్తున్న ఎంఎ జబ్బార్ ట్రస్ట్ సేవలు మరింత విస్తృత పరచాలని, వారికి కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు, ఖ్యాతి లభిస్తూ మరెన్నో అత్యున్నత పురస్కారాలను అందుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు యం. వేణుగోపాల్ రెడ్డి, బిజెపి సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గుండాల గోపినాథ్, బళ్లారి రాఘవ నేషనల్ అవార్డు గ్రహీత కళాతపస్వీ కోనేటి సుబ్బరాజు, ఆమూరి సుబ్రహ్మణ్యం, దేవిరెడ్డి రామకోటేశ్వర రావు, నటరాజ్ పిళ్ళై, గంటా ముత్యాల నాయుడు, నాగేశ్వరరావు హాజరయ్యారు. కార్యక్రమంలో కళాకారులు, కళాభిమానులు, ఎంఎ జబ్బార్ ట్రస్ట్ సభ్యులు, డాక్టర్ ఫరీద్ బాబా అభిమానులు పాల్గొన్నారు.



IN THE COURT OF THE XII ADDITIONAL DISTRICT JUDGE:: SRIKALAHASTI
I.A.NO.544/2024, I.A.NO. 157/2024
O.S.NO.119/2023

Between:
K.Sreeramulu Reddy (Died).... **Plaintiff/వాది**
By LRs.K.Vijayamamma & others
.... L.Rs. deceased Plaintiff / వారసులు
And
Ravilla Munirathnamma & others .....
Respondents/Defendants/ ప్రతివాదులు
To
(R-13) S. Vijayamma, W/o. Late Sathyam Reddy, Hindu, aged about 65 years, Housewife;
(R-14) S. Lakshmi Uday Kumar, S/o. Late S. Sathyam Reddy, Hindu, aged about 40 years, cultivation;
(R-15) S. Prathap Reddy, S/o. Late Sathyam Reddy, Hindu aged about 37 Years, Business;
Respondents No.13 to 15 are residing at Chenchurami Chetty Kandriga Village, Godalivaaripalem Post, Varadaiahpalem Mandal, Tirupati District. ... **Respodents/ Proposed Defendants / L.Rs. of Deceased D-10**

నోటీసు ప్రకటన

పై నెంబరు దావా O.S.No.119/2023 వాది అయిన కె.శ్రీరాములు రెడ్డి ప్రతివాదులపై వేసిన తర్వాత చనిపోయినందున ఇతని వారసులు/ L.Rs, I.A.No. 157/2024 గల పిటిషన్ వేసి 10వ ప్రతివాది/R-10కు నోటీసులు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా పంపగా R-10 S. Sathyam Reddy చనిపోయినాడని ఇతని వారసులు అయిన పై కనిన Respondents No. R-13, R-14, R-15 లను పై నెంబరు I.A.No. 157/2024 పిటిషన్‌లో కలుపుటకు I.A.No. 544/2024 పిటిషన్ వేసి వారికి నోటీసులు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా పంపియూ జారీ కానందున వారికి Substituted Service of Notice నిమిత్తం 07-01-2025వ తేదీకి వాయిదా వేసి యున్నారు. కావున సదరు Respondents No. R-13, R-14, R-15 సదరు వాయిదాకి ఉదయం 10-30 గంటలకు సదరు కోర్టు వారి ఎదుట హాజరై వారి ఆక్షేపణలను తెలుపుకొనవచ్చును.లేనియెడల వారి పరోక్షమందు సదరు Petition I.A.No. 554/ 2024 ను తీర్మానించబడును.

E.PRABHAKAR REDDY
Advocate for Petitioners/L.Rs of Deceased Plaintiff Srikalahasti.

పెరుగుతున్న చలి..వృద్ధులు జర భద్రం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: వర్షాకాలం నుండి శీతాకాలానికి మారితే చలి, మంచుకు ప్రజలు జర భద్రంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. చలి గాలులు వీస్తుండడంతో పాటు ఉదయం దట్టమైన పొగ మంచు కమ్మేస్తోంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలు, వివిధ పనులు నిమిత్తం వెళ్లే ప్రజలు , కూలీలు చలి కాలంలో ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు పేర్కొంటున్నారు. ఉదయాన్నే వాకింగ్, జాగింగ్ చేసేవారు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవాలని, లేకుంటే వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఆస్మా ఉన్నవారు శీతాకాలంలో వాకింగ్‌కు వెళ్లక పోవడమే మంచిదని, చలి తీవ్రత పెరిగే కొద్దీ శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదం ఉండటంతో ఉదయాన్నే బయటకు వెళ్లకపోవడం మంచిదని, వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో పరిసరాల పరిశుభ్రత అంతే ముఖ్యమని పేర్కొంటున్నారు. శీతాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, దీంతో టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా మెదడు వాపు, విష జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందంటున్నారు.



తాగునీటి విషయం లోనూ జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగడం ఎంతో శ్రేయస్కరమని తెలుపుతున్నారు. వేడి వేడి ఆహార పదార్థాలను తీసుకోవడం మంచి దని వైద్య నిపుణులు చెబుతున్నారు. వంట పాత్రలపై మూతలు పెట్టాలని, దోమతెరలు వాడాలని, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు జాగ్రత్తలు పాటించాలని, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు జ్వరం, దగ్గు ఉన్నవారు, దగ్గు, జ్వరం ఉన్నవారు వెచ్చని వాతావరణంలో ఉండేలా చూసుకోవాలన్నారు. వృద్ధులు, చిన్నారులతో పాటు అన్ని వయస్సుల వారు తమ కనుగుణంగా స్వెటర్లు, మంకీ క్యాప్‌లు జర్కిన్‌లు ధరించడం ఉత్తమం అని, శీతల పానీయాలకు, ఐస్ క్రీమ్‌లకు దూరంగా ఉంటూ బయటకు వెళ్లినప్పుడు చెవుల్లో దూది పెట్టుకుని వెళ్లడం మంచిదని, శీతాకాలం ముగిసే వరకు ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ఉత్తమమని పేర్కొంటున్నారు.

అపుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులుగా డాక్టరు విశ్వనాథ్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర సర్వ సభ సమావేశం గుంటూరులోని కే.ఎల్. యూనివర్సిటీలో జరిగింది. అపుస్మా రాష్ట్ర స్థాయి కమిటీ ఎన్నికలో రాయలసీమ జోన్ అధ్యక్ష పదవికి తిరుపతి విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్. విశ్వనాథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఎల్సీ యంవీ.రామచంద్ర రెడ్డి, అపుస్మా రాష్ట్ర అధ్యక్షులు తులసి విష్ణు ప్రసాద్, రాష్ట్ర లీగల్ అడ్వైసర్ కే. ఎస్.వాసు, నాయకులు డీ.జి.రఘునారాయణరావు, ఎస్. భాస్కర రాజు, ఎస్.ఎం.బాషా,టీ.రామకృష్ణ రెడ్డి, బీ.వెంకటేష్ బాబు,ఆర్. శ్రీధర్ రెడ్డి,మనోహర్ తదితర నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి రామచంద్రాపురం: రాష్ట్రంలో నిరుద్యోగ నిర్మూలనకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) స్పష్టం చేశారు. ఆదివారం రఘునాథ రిసార్ట్స్ లోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వ హణపై విలేకరులతో మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో ఉన్నత చదువులు చదువుకున్న యువతీ యువ కులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిం చడమే తన లక్ష్యమని, ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ నెరవేర్చడం కోసమే జనవరి 3వ తేదీ సీఎం స్వగ్రామం నారావారిపల్లెలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులేస్తుందని వివరిం చారు. అందులో భాగంగా సీఎం స్వగ్రామం నారావారిపల్లెలో పెద్ద ఎత్తున మెగా జాబ్ మేళా నిర్వహించేందుకు సమాయత్తమైనట్లు పేర్కొన్నారు. 20 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అందులో భాగంగా సుమారు 1200 మందికి ఉద్యోగాలు కల్పించే దిశగా ఈ కార్యక్రమం జరగనుంది అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, డిఆర్డిఏ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో నారావారిపల్లి లోని టిటిడి కళ్యాణ మండపంలో మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐదవ తరగతి మొదలుకొని బీటెక్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేళాకు సంబంధించి పోస్టర్ను వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జాబ్ మేళాకు సంబంధించి ముందస్తుగా రెండవ తేదీ లోపల రిజిస్టర్ చేసుకొని రావాల్సి ఉంటుందని అధికారులు వివరించారు. వివరాలకు 9160912690, 91775 08279, 90305 27060 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ సంచాలకులు శోభన్ బాబు, జిల్లా ఉపాధి కల్పనాధికారి, వెంకటరమణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్ లోకనాథం పాల్గొన్నారు.

అనునిత్యం వినోదం..

- 31న సరిగమప పార్టీకి వేళాయెరా...
- 1న సరికొత్త సీరియల్ చామంతి ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: అనునిత్యం వినోదం పంచే కార్యక్రమాలతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు మరిన్ని వినోదభరిత కార్యక్రమాలతో 2024 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూనే, నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికేందుకు సిద్ధమైంది. ఇటీవల ఖమ్మంలో ఘనంగా జరిగిన 'సరిగమప పార్టీకి వేళాయెరా' కార్యక్రమాన్ని డిసెంబర్ 31, రాత్రి 10 గంటలకు ప్రసారం చేయనుంది. ఆసక్తికరమైన మలుపులు, అదిరిపోయే ట్విస్టులతో సాగే సీరియల్స్ అందిస్తున్న జీ తెలుగు మరో ఆకట్టుకునే అంశంతో సాగే చామంతి సీరియల్‌ను నూతన సంవత్సర కానుకగా అంది స్తోంది. 'సరిగమప పార్టీకి వేళా యెరా' డిసెంబర్ 31, సరికొత్త సీరియల్ చామంతి జనవరి 1న(బుధవారం) ప్రతిరోజు రాత్రి 8.30 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారం కానుంది. ఈ వేదికపై ప్రతిభావంతులైన ప్రత్యేక ప్రతిభావంతులను ప్రోత్స హించింది జీ తెలుగు. 2024 సంవత్సరానికి ఘనమైన వీడ్కోలు పలుకుతూ అభిమానుల కోలాహలంతో సాగిన ఈ కార్యక్రమాన్ని మీరూ మిస్ కాకుండా చూడాలని జి తెలుగు తెలిపింది.

